క్లుప్తంగా

ఆకట్టుకున్న భారతదేశ మ్యాప్ ఆకారం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



మాచవరంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకోవటంతో పాటు దేశానికి సేవ చేయాలని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేశం మనకు ఏమి ఇచ్చిందని కాకుండా దేశానికి మనం ఏమి చేశామని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు భారత దేశం మ్యాప్ ఆకారంలో జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం మాచవరం ఏలూరు రోడ్డులో జాతీయ జెండాలు చేతబూని హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డి.యుగంధర్, అధ్యాపకులు డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, జే.నాగేశ్వరరావు, కె.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అనారోగ్యంతో బాధపడుతున్న 31వ డివిజన్‌కు చెందిన మన్నెం వెంకటేశ్వరరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 4.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు నాయకులు దేవరపు మాల్యాద్రి, డి.మురళీకృష్ణం రాజు పాల్గొన్నారు.

బాబా మందిరంలో రేపు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శనివారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయన్నారు. స్వామివారికి 108 రకాల ప్రసాదాలు నివేదన చేసి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేస్తామని చెప్పారు. భక్తులు కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎస్పీఎఫ్ ఎస్‌ఐ కోటేష్‌కు ఇండియన్ పోలీస్ మెడల్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ పరిధిలోని ఎస్పీఎఫ్ విభాగంలో ఎస్‌ఐగా పనిచేస్తున్న కొత్తకోట కోటేష్‌కు ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. శ్రీకాకుళం జిల్లా పెద్దపద్మాపురానికి చెందిన కోటేష్ 19వ ఏట 1987లో బీఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరి 1993 వరకూ సేవలందించారు. అనంతరం పర్మినెంట్ ట్రాన్స్‌ఫర్‌తో ఏపీ ఎస్పీఎఫ్ విభాగానికి వచ్చారు. నాటి నుంచి టీటీడీ దేవస్థానంతో పాటు పలు యూనిట్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తుండగా, ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన నిషా షా

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ బాపట్లలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో నిషా షా సత్తా చాటింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న నిషా 1500 మీటర్ల రన్నింగ్‌లో మూడో స్థానంలో నిలిచి, పతకం గెలిచింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజతో పాటు అధ్యాపకులు, సహచర విద్యార్థులు గురువారం ఆమెకు అభినందనలు తెలియజేశారు.

మళ్లీ వెంటాడుతున్న భయం !

- కొద్దిపాటి వర్షాలకే సింగ్‌నగర్ రోడ్లపై నిలిచిపోతున్న వర్షపు నీరు
- నందమూరినగర్‌లో ముంపునకు గురైన 30 ఇళ్లు
- భయాందోళనలో ప్రజానీకం



భారతమాత గుడి ఎదురు రోడ్డులో నిలిచిన నీరు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ప్రాంతం మళ్లీ మునిగిపోతుంది.. గతేడాది ఈ ప్రాంత ప్రజలను కలవరానికి గురిచేసిన బుడమేరు మళ్లీ ఉధృతంగా ప్రవహించడంతో పాటు ఇక్కడి రోడ్లు, ఇళ్లల్లోకి వర్షపునీరు వచ్చి చేరుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థపై చర్యలు శూన్యం..

బుడమేరు వరదల తరువాత సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో చాలా చోట్ల డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. నందమూరినగర్, భారతమాత మందిరం కాలనీ, ఇందిరానాయక్‌నగర్, నన్‌సిటీకాలనీ పరిసర ప్రాంతాల్లో అయితే కొన్ని చోట్ల అసలు సైడ్ డ్రెయిన్ల నిర్మాణమే జరగలేదు. దీంతో కొద్దిపాటి వర్షం పడినా అవి పారే దారి లేక రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. ఇక సింగ్‌నగర్ ప్రాంతంలో అయితే డ్రెయిన్లలో పూడికలు సరిగా తీయకపోవడంతో వర్షపునీరు కదిలే మార్గం లేక అవన్నీ రోడ్లపైకి, ఇళ్లల్లోకి చేరిపోయి మళ్లీ ముంపు సమస్యకు దారితీస్తున్నాయి. రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు సింగ్‌నగర్‌లోని ప్రధాన రహదారులతో పాటు నందమూరినగర్, భారతమాత గుడి ఎదురు రోడ్లు, కేఎల్‌రావు రోడ్డు, నల్లమస్తాన్ రోడ్డు, కృష్ణాహోటల్ సెంటర్‌లోని పలు రోడ్లు జలమయమయ్యాయి. దీంతో స్థానిక ప్రజలంతా మళ్లీ వరదలు వచ్చేశాయేమోనని తీవ్ర ఆందోళనలకు లోనయ్యారు. స్థానిక ప్రజల నుంచి పదే పదే ఫిర్యాదులు రావడంతో కార్పొరేషన్ ఉన్నతాధికారులు మోటార్లు పెట్టి పైపులద్వారా రోడ్లపై, ఇళ్లల్లో నిలచిన నీటిని యూజీడీ లైన్లలోకి వదులుతున్నారు. ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా స్పందించి డ్రెయినేజీ వ్యవస్థ తీరుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని.. వర్షపునీరు నిలవకుండా చర్యలు చేపట్టడంతో పాటు డ్రెయిన్లు సక్రమంగా పారేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నందమూరినగర్‌లో వర్షపునీటిలో అవస్థలు పడుతున్న ప్రజలు



మోటార్లు పెట్టి రోడ్లపై నీటిని యూజీడీ లైన్లలోకి వదులుతున్న దృశ్యం

తొలగని వరద ముంపు



ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న వరద నీరు

- ఇళ్లలో కొనసాగుతున్న వరద నీరు
- ఆందోళనలో ముంపు బాధితులు



బుడమేరు మధ్యకట్టలో ఇళ్లలోకి చేరిన వరద నీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద కొంత మేర తగ్గుముఖం పట్టినప్పటికీ బుడమేరు మధ్య కట్ట విజయదుర్గానగర్‌లో మాత్రం పలు నివాసాల్లో నీరు నిలిచే ఉంది. దీంతో బుడమేరు మురుగు నీటితో సావాసం చేస్తున్నారు. ఇళ్లలో నీరు నిలిచిపోవటం వల్ల కనీసం భోజనాలు సైతం వండుకోలేకపోతున్నామని.. హోటల్ నుంచి తెచ్చుకుని తినాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో బుడమేరు వరద నీరు నిలిచిపోవటం వల్ల సామాన్లు పాడవ్వటంతో పాటు కంటి నిండా నిద్రలేకుండా పోయిందని లబోదిబోమంటున్నారు. రాబోయే రోజుల్లో బుడమేరు వరద తగ్గుతుందో లేక అల్పపీడన ప్రభావంతో మరింత పెరుగుతుందోనంటూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. బుడమేరు వరద గత చేదు జ్ఞాపకాలు గుర్తుకు వస్తే గుండెదడ పుడుతుందని వాపోతున్నారు. ఇక్కడ అధికారులు పునరావాస కేంద్రానికి రావాలని చెబుతున్నప్పటికీ స్థానికులు మాత్రం పునరావాస కేంద్రానికి వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. బుడమేరుకు ఆనుకుని ఉన్న నివాసితులు మాత్రం తమకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయిస్తే ఇక్కడ నుంచి స్వచ్ఛందంగా వెళ్లిపోతామంటున్నారు.

మూడు రోజులుగా నీళ్లలోనే..



ఇక్కడ కొద్దిపాటి వర్షాలకే వర్షపు నీరు, మురుగు నీరు ఇంటిలోకి చేరుతోంది. దీంతో ఇంట్లోని వస్తువులు పాడయ్యాయి. మూడు రోజులుగా ముంపులోనే ఉంటున్నా. భోజనం సైతం వండుకునే అవకాశం లేక హోటల్ నుంచి తెచ్చుకుంటున్నా.

– నందిగం సుబ్బారావు, విజయదుర్గానగర్

ఇళ్లు కేటాయిస్తే.. వెళ్లిపోతాం



బుడమేరు వరద ఇళ్లలోకి వచ్చింది. ఇప్పటికీ ఇంట్లో వరద నీరు నిలిచే ఉంది. ఈ వయస్సులో ఇక నాకు తిరిగే ఓపిక లేదు. ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయిస్తే ఇక్కడ నుంచి స్వచ్ఛందంగా వెళ్లిపోతాం.

– రత్నాలు, విజయదుర్గానగర్

పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



లోబ్రిడ్జి వద్ద కుంగిన రోడ్డు, గోడను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వీఎంసీ ఏర్పాటు చేసిన అన్ని పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం ప్రకాశం బ్యారేజ్, హెచ్‌బీ కాలనీ, అజిత్ సింగనగర్, వన్‌టౌన్ లోబ్రిడ్జి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లోబ్రిడ్జి వద్ద గోడ ప్రమాదకరమైన స్థితిలో ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని వెంటనే ఆ మరమ్మతులు చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరం, రిసెప్షన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ శిబిరాలకు వచ్చే ప్రజల నమోదుకు రిజిస్టర్ కచ్చితంగా పాటించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని, లైట్లు, ఫ్యాన్లు, ఎలక్ట్రిసిటీ సంబంధిత వసతుల్లో ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు.

నగరంలో 40 పునరావాస కేంద్రాలు

కొత్త రాజరాజేశ్వరిపేట కేర్ అండ్ షేర్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఉదయం టిఫిన్‌ను కమిషనర్ ధ్యానచంద్ర అందించారు. గురువారం నగర పరిధిలోని పునరావాస కేంద్రాల్లో 660 మందికి ఆహార సౌకర్యం కల్పించామన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని సురక్షిత ప్రదేశాలకి తరలించాలని చెప్పారు. నగరంలో ఉన్న 40 పునరావాస కేంద్రాల్లో లోతట్టు, వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వారి సమీపంలోని పునరావాస కేంద్రంలోకి తరలించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వరద నీరు లేబర్ కాలనీ నివాస స్థలాల్లో చేరుకున్న ప్రాంతాల్లోని వారికి ఇంటి వద్దనే ఆహారం అందజేయాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జె.శ్రీనివాస్, వి.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు



స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో శుక్రవారం జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ఎలాంటి అవాంతరాలు, సమస్యలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న స్వాతంత్ర్య వేడుకల ఏర్పాటు, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ప్రారంభించబోతున్న స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభ వేడుకల్లో కూడా సమస్యలు రాకుండా అధికారులు పటిష్ట ఏర్పాటు చేయాలని గురువారం చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. ఆయా కార్యక్రమాలకు విచ్చేసే ప్రజలందరికీ వీఎంసీ కల్పించే సౌకర్యాల్లో ఎటువంటి అసౌకర్యం కలిగించరాదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ పి.సత్యకుమారి, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) పి.వెంకటనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.శ్రీనివాసరెడ్డి, జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం మహిళలకు అందించే ఉచిత బస్సు పథకాన్ని తాము స్వాగతిస్తున్నామని కానీ ఈ పథకం వల్ల జీవనోపాధి దెబ్బతింటున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు చర్చలకు పిలవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిరాయిలు లేక ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాలు జీవనం కోల్పోయి రోడ్డున పడుతున్నాయన్నారు. బ్యాడ్జితో సంబంధం లేకుండా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జరిమానాలు విధించే జీవో నెంబర్ 21 రద్దు, సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఐదు శాతం వడ్డీతో ఆటోలు కొనుగోలుకు ఇస్తానన్న నాలుగు లక్షల రూపాయలు అమలు చేయాలని దీనిపై కూటమి ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆటో,క్యాబ్ డ్రైవర్లు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతారని హెచ్చరించారు. సమావేశంలో విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, నాయకులు ఏవీ రెడ్డి, పడగళ్ల చిన్న(గణేష్) డి.కాశేశ్వరరావు బి.కుమార్ పి.శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యులు సేవా భావం కలిగి ఉండాలి



పాయకాపురం(విజయవాడ రూరల్): ఆజాద్ ముస్లిం కమిటీలో సభ్యత్వం తీసుకునే వారు సేవా భావం కలిగి ఉండాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. కండ్రికలోని కమిటీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో 64వ డివిజన్ కార్యదర్శిగా మహమ్మద్ షఫీఉల్లాను నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ.. సభ్యత్వం తీసుకున్న వారు కమిటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ముస్లిం, మైనార్టీల సమస్యలను తెలుసుకొని అలాంటి వారికి సహాయం చేయడంలో ముందుండాలని సూచించారు. గత 44 నెలలుగా కమిటీ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. సింగ్‌నగర్‌లో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా సాజిద్ అలీ, 61, 64 డివిజన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

బుడమేరు ముంపు వాసులకు పునరావాసం కల్పించాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



వరద ముంపు బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించి బాధితులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు కోరారు. బుడమేరు మధ్యకట్ట బుడమేరు ముంపు ప్రాంతాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బుడమేరు ముంపు బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఇళ్ల దగ్గరకు వెళ్లి స్వయంగా పరిశీలించి వారికి అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు. బుడమేరు ద్వారా ఎవరైతే ఇబ్బందులకు గురి అవుతున్నారో వాళ్లకు సహాయక చర్యలు అందించాలని, పునరావాస కేంద్రాలు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతం నుంచి వారు వెళ్లాలనుకుంటే వాళ్లకి వాంబే కాలనీలోని జేఎన్‌ఎన్‌యూఎం ఇళ్లు కేటాయించి తరలించాలని డిమాండ్ చేశారు. బుడమేరులో ఇంత వర్షపాతం నమోదవుతుందని, ఇన్ని క్యూసెక్కుల నీరు వస్తుందని, బుడమేరు మధ్యకట్ట వాసులకు ఈ ప్రభుత్వం ముందస్తు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముంపు బాధితులకు ఆహారం, బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బుడమేరు ప్రక్షాళన చేయాలని కోరారు.

వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నా బుడమేరు ముంపు నివారణకు చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు అన్నారు. సెంట్రల్ సిటీ సీపీఎం బృందం కండ్రిక, డాక్టర్స్ కాలనీ, ఉడా కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో గురువారం పర్యటించి భారీ వర్షాల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. దుర్గారావు మాట్లాడుతూ.. రెండు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ ప్రాంతంలో ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ నిద్రాహారాలు లేకుండా మళ్లీ ఎప్పుడు వరద వస్తుందోనని భయాందోళన చెందుతున్నారన్నారు. వర్షాల కారణంగా అధికారులు అక్కడక్కడ మోటార్లు పెట్టినా అవి చాలకపోవడంతో సైడ్ కాలువల్లో నీరంతా ఇళ్లల్లోకి చేరి ఇంటిలో వస్తువులన్నీ తడిసి పాడైపోతున్నాయని చెప్పారు. కొన్ని ఇళ్లు వర్షానికి తడిచి శ్లాబులు, సైడు గోడలు పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మోటార్ల సంఖ్య పెంచి ప్రజలకు ఎలాంటి సమస్యల్లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, ఎస్కే పీరుసాహెబ్, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో గ్యాంగ్ వార్

- కర్రలు, రాడ్డులు, బ్లేడ్లతో రెచ్చిపోయిన రెండు గ్రూపులు
- పలువురికి గాయాలు.. భయంతో పరుగులు తీసిన జనం



లూనాసెంటర్‌లో కొట్లాటకు దిగిన ఇరు గ్రూపుల సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బెజవాడలో గ్యాంగ్ వార్ మరోసారి బీభత్సం సృష్టించింది. రౌడీషీటర్లు.. బ్లేడ్ బ్యాచ్.. గంజాయి బ్యాచ్ సభ్యులకు అడ్డాగా మారిన సింగ్‌నగర్ ప్రాంతం దీనికి వేదికైంది. పాత గొడవ నేపథ్యంలో రెండు గ్రూపుల మధ్య తలెత్తిన వివాదం గ్యాంగ్ వార్‌గా దారి తీసింది. నడిరోడ్డుపైనే పదుల సంఖ్యలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు సృష్టించిన వీరంగంతో సింగ్‌నగర్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

పాత గొడవల నేపథ్యంలో దాడులు

సింగ్‌నగర్ లూనాసెంటర్ ప్రాంతానికి చెందిన గోపి, కృష్ణ అనే ఇద్దరు వ్యక్తుల మధ్య కొన్ని రోజుల క్రితం నెలకొన్న ఓ వివాదం పెద్ద గొడవకు దారి తీసినట్లుగా తెలుస్తోంది. ఆ ఇద్దరు కొన్ని రోజుల క్రితం ఒకరు ఒకరిపై దాడి చేసి గాయపర్చగా నేడు వారిలో మరొకరు తన కుర్రాళ్లను వెంటబెట్టుకొని వచ్చి పగ తీర్చుకున్నారు.

కర్రలు, రాడ్డులతో పరుగులు

గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు కర్రలు, రాడ్డులు, బ్లేడ్లను పట్టుకొని సింగ్‌నగర్ లూనాసెంటర్ ప్రాంతంలో చొక్కాలు విప్పి పరుగులు తీస్తూ హల్‌చల్ చేశారు. అడ్డు వచ్చిన వారిని కొట్టుకుంటూ చంపేస్తాం అంటూ పెద్ద పెద్దగా కేకలు పెట్టుకుంటూ నానా బీభత్సం చేశారు. ఒక్కసారిగా పదుల సంఖ్యలో గంజాయి బ్యాచ్ సభ్యులు, పాతనేరస్తులంతా అక్కడకు చేరడంతో ఏమి జరుగుతుందో తెలియక ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పోలీసులు వచ్చినా కూడా వారు ఏ మాత్రం భయపడకుండా అదే విధంగా వారి ముందు కూడా రెచ్చిపోయారు. పోలీసులు ఎవరికి వారిని పంపివేసేందుకు కష్టపడాల్సివచ్చింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. కొంతమంది ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా మరికొంతమంది పరారయ్యారు. పోలీసులు బాధితుల్లో కొంతమందిని అంబులెన్స్‌లో ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా లూనాసెంటర్

సింగ్‌నగర్ లూనా సెంటర్, లెనిన్‌సెంటర్, ఎంకే బేగ్ స్కూల్ పరిసర ప్రాంతాలు గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులకు అడ్డాలుగా మారిపోయాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్లపై నడవాలంటేనే తమకు చాలా భయంగా ఉంటుందని, ఇటీవల కాలంలో వీరి ఆగడాలు మరింత పెచ్చుమీరుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రత్యేక బీట్లు ఏర్పాటుచేసి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.